# స్పాట్‌లైట్

"బావులు, చెరువులు, నదులు...

"ఛా, ఏమిట్రా యిది! ఏడో ప్రశ్న ఏమిటండీ?"....'భారతదేశంలో నీటి పారుదల సౌకర్యాల ఆవశ్యకత ఏమిటి?'.... ఆవశ్యకత ఏమిటంటే లిస్టు ఏకరువు పెడతాడా!... ఏమండీ మేడమ్. తప్పుగదూ?... కొట్టేస్తున్నాన్లెండి!"

"అమ్మాయ్ నాగమణీ! అలా మాట్లాడితే ఎలాగమ్మా? కరెక్షన్‌హాలు గదూ! మౌనంగా నీ పనేదో నువ్వు చేసుకోవాలి. మాట్లాడ్డం ప్రారంభిస్తే చుట్టుప్రక్కల వాళ్ళకు 'డిస్టర్బెన్స్'గా వుండదూ?" హెచ్చరించిన ఉద్యోగిని పేరు జానకీబాయి. ఆమె జిల్లాలోని ఒకానొక బాలికోన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయిని. ఇక్కడ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లో సోషల్‌స్టడీస్ సబ్జక్టు క్రింద ఆరో బ్యాచికి చీఫ్ ఎగ్జామినర్ హోదా ఆమెది.

"సారీ మేడమ్! నేనయినా మాటాడ గూడదనే అనుకుంటాను. కర్మ - నోరూరుకోదే!..." నొచ్చుకుంటూ క్షమాపణ చెబుతుంది నాగమణి.

మళ్ళీ ఒకటి రెండు నిమిషాల వరకే నిశ్శబ్దం.

"సిపాయిల కలహానికి నాలుగు కారణాలు రాస్తే చాలు గదండీ! ఈ అబ్బాయెవరో ఆరు కారణాలు రాసేశాడు. పైగా అన్నీ రైటే రాశాడు..."

"అబ్బాయని ఎందుకనుకోవాలి? అమ్మాయై వుండకూడదా?" అడ్డుతగిలిన వ్యక్తి కామేశ్వరి. ఆమె స్థానిక పురపాలకోన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ అసిస్టెంటు. ఇక్కడేమో ఆరో బ్యాచికి స్పెషల్ అసిస్టెంటు.

"ఏమండీ కామేశ్వరీ మేడమ్! ఆ మాత్రం మగ దస్తూరీ ఏదో, ఆడ దస్తూరీ ఏదో నాకు తెలియదంటారా? ఏమనుకున్నారో! నా కెనిమిదేళ్ళ సర్వీసు..."

'ఔరా, ఔరా' అన్నట్టు నెమలిపిల్ల క్రేంకరించినట్టుగా నవ్వేస్తుంది కామేశ్వరి. "బ్యాచికి పదిమంది చొప్పున పది బ్యాచీల్లోనూ కలిసి ఎంత లేదన్నా ఈ హాల్లో వందమంది టీచర్లున్నారమ్మా నాగమణీ! వాళ్ళల్లో పదిహేను మొదలు పాతికేళ్ళ వరకూ సర్వీసున్న వాళ్ళే హెచ్చు! ఇక్కడ నీ ఎనిమిదేళ్ళ సర్వీసొక లెక్కలోకి వచ్చేదే నంటావా తల్లీ?"

"ఏమో, అదంతా నాకు తెలియదు. కావలిస్తే నేను పందెం కడతాను. ఈ దస్తూరీ మాత్రం అబ్బాయిదే!"

"అమ్మాయ్ నాగమణీ! దస్తూరిని గురించి కూడా పోట్లాటకు దిగితే ఎలాగమ్మా? ఇది కరెక్షన్ హాలుగదూ..." రికార్డు పెట్టినట్లుగా మళ్ళీ అదే మాటలతో జానకీబాయి మందలింపు.

"సారీ మేడమ్! ఇంక మాటాడితే ఒట్టు" - నాగమణి వాగ్దానం.

షరా మామూలే! మేము వాగ్దానభంగం కోసం ఎంతోసేపు వేచివుండవలసి వచ్చేదిగాదు.

"ఏమండీ మేడమ్! ఒక సందేహం. మీరడగమంటేనే అడుగుతాను. వద్దంటే మానుకుంటాను."

"అడుగమ్మా తల్లీ! జెనైన్ సందేహమైతే ఫరవాలేదడుగు..."

"ఇందాక రెండు పేపర్లు చూచారండీ! ఫోటో తీసినట్టు రెండూ ఒక్కలాగే వున్నాయి. అటెంప్ట్ చేసిన ప్రశ్నల వరుసక్రమాన్నిబట్టి చూచినా సరే, వాక్యాలకు వాక్యాలు, పదాలకు పదాలు విడగొట్టి చూచినాసరే కించిత్తు తేడా కనిపించడం లేదు..."

"సరేనమ్మా! కాపీ జరిగినట్టు తెలిపోయింది. అంతేగదూ! అందుకిప్పుడేం చేయాలంటావ్?"

"అంతటితో ఏమయింది మేడమ్? ఎందుకైనా మంచిదని వరుసబట్టి యింకొక ఏడెనిమిది పేపర్లు కూడా చూచాను. అన్నీ ఒకదానికొకటి డిటోగా వున్నాయి. నాకు చూడంగా ఎవరో డిక్టేట్ చేస్తుంటే రూమురూమంతా బుద్ధిగా వ్రాసుక పోయినట్టే వుంది...."

"అమ్మాయ్ నాగమణీ! నీకు పుణ్యముంటుంది తల్లీ! నువ్విక్కడికొచ్చింది నేర పరిశోధన కోసంగాదు, పేపర్లు దిద్ది మార్కులు వెయ్యడానికి! నీ పని నువ్వు సజావుగా చేస్తేచాలు! మిగిలిన విషయాలు నీ కనవసరం!"

మంచు దెబ్బ తిన్న తమ్మిపువ్వులా నాగమణి ముఖం ముడుచుకపోయింది. ఆమాత్రానికి పరీక్షలెందుకో - అని ఆమె పైకి అనలేదు, మనసులో అనుకుని వుంటుంది.

"అవునమ్మా నాగమణీ! ఈ ప్రపంచంలో ఏది ఎలా జరగాలో అలా జరగడంలేదు; ఎలా జరగగూడదో అలా జరిగిపోతోంది. మహాయంత్రంలో మరచీలలం, మనమేం చేయగలం చెప్పు?" అంటూ ఆమెను ఓదార్చాను.

కృతజ్ఞత నిండిన కళ్ళతో నావైపు చూచింది నాగమణి.

* * *

నాగమణి 'స్పాట్'కు రావడం యిదే తొలిసారి. ఆమెతో పోల్చి చూస్తే 'స్పాట్' కు సంబంధించినంత వరకూ మిగిలిన టీచర్లలో చాలామంది పాతపులులకింద లెక్క! మరింత సహజ సుందరంగా చెప్పాలంటే విద్యావ్యవస్థ అనే కట్టడంలో మేము పాత పందికొక్కులం. ఎర్రకోటపైన మువ్వన్నెజండా ఎగిరి ముప్పైయేళ్ళ కావస్తున్నా ఈ దేశంలో విద్యావ్యవస్థ ఇంకా పొయ్యిమీద వుడుకుతున్న పాకంలాగానే వుంది; వినియోగానికి సిద్ధమైన తినుబండారంలా లేదు. మధ్య మధ్యలో వంట చేసేవాళ్ళు మారిపోతూ వుండడం, కొత్తవాళ్ళు తయారీలో వున్న పాకంపైన సరికొత్త ప్రయోగాలు తలపెట్టడం దీనికి పట్టిన దురదృష్టం. సిలబస్ విషయంలో మన అత్యాశ ఏనుగును తీసుకొచ్చి చిన్న బరిణెలో పెట్టాలనుకోడం కన్నా మెరుగ్గాలేదు. విద్యాలయాల సంఖ్య దేశాభివృద్ధిని గురించిన 'బోస్టింగు'కు మాత్రమే ఉపకరిస్తోంది. అయిదేళ్ళ అమ్మాయికి పెళ్ళిచేసి సంసార బాధ్యతలన్నీ అప్పగించినట్లుగా కనిపించే పాఠశాలలే హెచ్చు. పంతుళ్ళ దగ్గరికొస్తే వాళ్ళల్లో పనిచేసే వాళ్ళకు కితాబులేదు; చేయని వాళ్ళకు దండన లేదు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఒక హాబీగా భావించి వేరే వ్యాపకాల్లో నాలుగు రాళ్ళు గడించుకోలిగినవాళ్ళ పనే మోతగా వుంది. పరీక్షలకు పరిగణన లేదని తెలిసినప్పటినుంచీ విద్యార్థులయ్యవార్లతో 'మీరు కొట్టినట్టే కొట్టండి, మేము ఏడ్చినట్టే ఏడుస్తా' మని చెప్పకనే చెబుతున్నారు. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పరీక్ష లొచ్చినప్పుడు శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలున్నాయన్న విషయం ప్రయోగాత్మకంగా ఋజువైపోయింది. ఈ లొసుగులన్నీ మాకు తెలియనివేమీ కాదు. కానీ మేము కళ్ళుండి గూడా చూడడం మానేశాం. చెవులుండి గూడా వినడం మానేశాం. 'అలో లక్ష్మణా' అన్నట్టుగా 'బెల్లో, బిల్లో' అనుకుంటూ రోజులు లెక్కించుకోడమే మా పని! స్పాటుకు తొలిసారిగా వచ్చిన నాగమణి వాలకం మా వైఖరికి

భిన్నంగా వున్నట్టు ఆమెను చూడగానే నాకు తెలిసిపోయింది. ఉద్యోగధర్మ నిర్వహణమనే మరుభూమిలో ఆమె చిన్ననాటి ఆదర్శాల సెలయేళ్ళు యింకా యింకిపోయినట్టులేదు. ఒకానొక పవిత్ర కర్తవ్యం నిర్వహించే ఉత్సాహం ముఖంలో పరవళ్ళు త్రొక్కుతుండగా ఆమె హాల్లో అడుగుపెట్టింది.

సూటిగా ఆరోబ్యాచి కోసం కేటాయించిన డెస్కుల దగ్గరకొచ్చింది నాగమణి. అప్పటికి నేనొక్కణ్ణి మాత్రమే అక్కడ దినపత్రిక చదువుకుంటూ హాజరైవున్నాను.

"నమస్కారమండీ మేష్టరుగారూ!" అంటూ నా మర్యాద నాకు చెల్లించి "మీరు గూడా ఆరోబ్యాచే గదండీ?" అంటూ ప్రశ్నించింది.

సమాధానం చెప్పుకున్నాక "ఏ వూరినుంచి వస్తున్నావమ్మా?" అని అడిగాను.

"నరహరికోట రైల్వేస్టేషనుంది గదండీ! అక్కడ నుంచీ మావూరికి నాలుగుమైళ్ళ దూరం. దేవళంపేట. అప్పరెలిమెంటరీ స్కూల్లెండి! నేను ఫస్టు అసిస్టెంటుని! వరుసగా నాలుగేళ్ళనుంచీ 'సోషల్ స్టడీస్' హేండిల్ చేస్తున్నాను. ఇంతవరకూ నా సబ్జక్టులో ఒక్కరంటే ఒక్కరు ఫెయిల్ కాలేదంటే నమ్మండి!"

తీసుకొచ్చిన రెండు పేనాలూ డెస్కుపైన పెట్టింది నాగమణి. మార్కులు వెయ్యడం గురించి జారీ చేయబడిన నిర్దేశక పత్రాన్ని పరిశీలిస్తూ బెంచీపైన కూచుంది.

టీచర్లు ఒక్కొక్కరుగా హాల్లోకి రాసాగారు. పాత పరిచయాల్ని నెమరు వేసుకోవడం, కొత్త పరిచితుల్ని పరామర్శించడం, మునుపటి స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లో తమకెదురైన అనుభవాలను ఏకరువు పెట్టుకోడం – యిలా హాలంతా సందడితోనూ, సంరంభంతోనూ నిండిపోతూ వుంది.

ఆ అలజడిని చీల్చుకుంటూ నావైపు చూచింది నాగమణి – "ఏమండీ, నోటీసు బోర్డు చూచాను, మన ఛీఫ్ జానకీబాయి ఎవరో తెలుసా మీకు? భలే స్ట్రిక్ట్‌గా వుంటుందట! 'స్పాటు'కు నేను కొత్తగదండీ! నాకేమిటో భయంగా వుంది..."

నాగమణి భయం మరికొన్ని రెట్లు ఎక్కువయ్యేటట్టుగా యింతలో మైకులో నుంచీ కాంప్ ఆఫీసరు పరశురామయ్యగారి గొంతు వినిపించింది. "శ్రద్ధగా వినాలి, ఉపాధ్యాయులకు హెచ్చరిక!"

గెజిటెడ్ ఇన్‌స్పెక్టరు పరశురామయ్యగారికి అగ్గిరామయ్యగారన్న ప్రఖ్యాతి వుంది. అసలే అగ్గి – అందులో యిప్పుడు బాధ్యత అనే గుగ్గిలం పడింది. 'స్పాట్' ముగిసేదాకా ఆయన యిక 'పూనకం' లాంటి అవస్థలో వుంటారని మాలో చాలా మందికి తెలుసు.

గొంతు సవరించుకుంటూ కొనసాగిస్తున్నారు పరశురామయ్యగారు – "ఎవరెవరి జాగాకు వాళ్ళు వెళ్ళి కూచోవలసిందిగా అసిస్టెంటు ఎగ్జామినర్స్ అందరినీ కోరడమైనది. పని జరుగుతున్న దశలో టీచర్లు వేరే హాల్సులోకి గానీ, లేదా తమ హాల్లోనే వేరే బ్యాచి దగ్గరికి గానీ వెళ్ళడం రూల్సును ఉల్లంఘించడంగా భావించబడుతుంది. అన్నట్టు, ఈ స్కూల్ కాంపౌండుకవతల పెద్ద జన సమూహం ఒకటి ప్రోగై వున్నట్టు యిప్పుడే అందిన వార్తలవల్ల తెలియవచ్చింది. టీచర్లతో బాటుగా జిల్లా దశదిశలనుంచీ పేరంట్స్ గూడా యిక్కడికి విజయం చేసివున్నారేమోనని అనుమానంగా వుంది. ఈ పరిస్థితుల్లో పరీక్ష నంబర్లు వేయబడ్డ 'చిట్లు' ఎవరి దగ్గర కనిపించినా, వాళ్ళపైన తీవ్రమైన చర్య తీసుకోబడుతుంది. అదిగో, అసిస్టెంట్ కాంప్ ఆఫీసర్లు పేపర్లు తీసుకుని మీమీ హాల్సులోకి వచ్చేస్తున్నారు. వాళ్ళు పేపర్లని ఛీఫ్ ఎగ్జామినర్లకు పంచి పెడతారు. 'ఛీఫ్' తమ బ్యాచ్‌లో

ఒక్కొక్కరికి యిన్నిన్ని పేపర్లని అందజేస్తారు. పని 'కమెన్స్' కావడానికింక పదిహేను నిమిషాల వ్యవధి మాత్రమే వుంది..."

"నా గుండె కొట్టుకుంటూ వుంది!" అంది నాగమణి.

"మంచిదమ్మా! నిలిచిపోతేనే ప్రమాదం" అన్నాను నవ్వుతూ.

చీఫ్ జానకీబాయి పేపర్లు పంచిపెట్టడమే ఆలస్యం, ఆవురావురని అన్నంపైన కలబడినట్టుగా టీచర్లు జవాబులపైన 'శస్త్రచికిత్సలు' ప్రారంభించారు.

పులులు, తోడేళ్ళు, ఎలుగ్గొడ్లూ మొదలైన వాటికి ఏ అడవయినా ఒకటే! కానీ చెవులపిల్లి సంగతి వేరు. అది ఏ నిర్ణయం తీసుకున్నా బెదురు బెదురుగానే తీసుకుంటుంది. 'స్పాట్'లో నాగమణి స్థితిగూడా అలాగే వుంది. ఏ ప్రశ్నకెన్ని మార్కులు? ఎన్ని పాయింట్లుంటే పూర్తిమార్కు లివ్వాలి? పాయింట్లు తగ్గితే ఆ మేరకు మార్కులు తగ్గించడం ఎలా? సముద్రంలో బొంబాయి అని వ్రాసి అదెక్కడుండాలో అక్కడ చుక్కబెట్టకపోతే మార్కు యివ్వొచ్చా, యివ్వగూడదా? అన్నీ సందేహాలే ఆమెకు! స్వగతాలను ప్రకాశం చేసి పదిమందితోనూ పంచుకోడం ఆమె అలవాటు. క్రమక్రమంగా మా బ్యాచిలోని టీచర్లందరూ ఆమె స్వగతాలకు అలవాటుపడిపోయారు. ఆమె మాట్లాడకపోతే అదేమిటో వెలితిగా అనిపిస్తోందిగూడా!

మే నెల మొదటివారం. ఎండలు మండిపోతున్నాయి. చెట్లలో ఆకు కదలడంలేదు. సిమెంటు రేకుల పైకప్పుక్రింద గాలి కూడా వేడెక్కిపోయింది. లంచ్ టైములో కాంటీనుకు వెళ్ళి భోజనం చేశాను. టీచర్లలో చాలామంది ఇంకా బయట చెట్లక్రిందనే తచ్చాడుతున్నారు. హాల్లోకి వెళ్ళి చూద్దునుగదా, నాగమణి యింకా పేపర్లతో పోరాడుతూనే వుంది.

దగ్గరికి వెళ్ళి "పూర్తికాలేదటమ్మా?" అని అడిగాను.

"ఇంకా రెండు పేపర్లున్నాయి. అవి దిద్దేశాక స్లిప్పుల్లో మార్కులు వెయ్యాలి."

ముంగురులు చెదరిపోయాయి. చెంపలమీద చెమట ధారలు కట్టింది. ముఖం వాడిపోయింది. యుద్ధరంగంలో నిస్సహాయంగా మిగిలిపోయిన ఒంటరి సిపాయిలా నాగమణి పేపర్లతో కుస్తీపడుతోంది.

ఆమె మిగిలిన పేపర్లు దిద్దేసరికి, స్లిప్పుల్లో నంబరు వారీగా మార్కులు నమోదు చేశాను.

"చాలా థేంక్సండీ మేష్టరుగారూ! నాలాంటి ఆడపిల్లలకు తండ్రయివుంటారు మీరు..."

"సరేనమ్మా! కాంప్లిమెంట్సు కేమొచ్చెగానీ ముందు నువ్వు నీ భోజనం సంగతి చూడు" అన్నాను.

"మధ్యాహ్నం టైముండదని ఉదయమే తెచ్చి పెట్టుకున్నానులెండి! నాలుగిడ్లీలు, రెండరటిపళ్ళు, సద్యా నోరెండిపోతూవుంది. ముందుగా ఓ లోటా నీళ్ళు తాగాలి. ఇక్కడున్నట్టుగా వచ్చేస్తాను. మేష్టరుగారూ! ఈలోగా జానకీబాయి గారొస్తే నా పేపర్లు జాగ్రత్తగా యిచ్చేస్తారుగదూ?"

మాట్లాడుతూనే హాల్లోంచి నిష్క్రమించింది నాగమణి. ఆమె వెళ్ళిపోయిన తర్వాత కొద్ది నిమిషాలవరకూ ఆమెను గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. నాగమణి ఆకారంలో ప్రత్యేకత ఏమిటో చెప్పడం కష్టం. ఆమె పొడుగరి కాదు. అలాగని పొట్టిగానూ లేదు. లావుపాటి మనిషిగాదు. అలాగని మరీ సన్నమూ గాదు. ఏవిధంగా చూచినా ఆమె

సగటు ఆడమనిషి. అందగత్తె గాకపోలేదు. కానీ ఉద్యోగపు హోదాలో కర్తవ్య పాలన చెయ్యవలసిన చోట అందంగా వుండడంకన్నా, పనిచేసి మెప్పించడం ముఖ్యమని ఆమె భావించడం నాకెంతో సంతృప్తిని చేకూర్చిన అంశం. ఏ పని చేసినా 'యిదేమిటి యిలా చేశా' వని యింకొకరు వేలెత్తి చూపించడానికి ఆస్కారం లేకుండా సజావుగా చెయ్యాలనే పట్టుదలను ఆమెలో నేను గుర్తించాను. అందుకోసం ఎంతటి శ్రమకైనా ఓర్చుకునే మనిషిలా వుంది నాగమణి!

నాగమణిని గురించి తీసుకోదగ్గ కంక్లూషన్స్‌లో ముఖ్యమైనదింకొకటేదో బాకీ ఉండిపోయినట్టనిపించి, అదామె హాల్లోకి తిరిగిరాగానే చటుక్కున స్ఫురించింది. ఆమె ఉద్యోగినిలా కనిపించదు. పక్కా గృహిణిలా వస్తుంది. వ్యానిటీ బ్యాగుకు బదులుగా ఆమె బట్టతో కుట్టిన చిన్న చేతి సంచీ ఒకటి తెచ్చుకుంది. మెడలో వేసుకున్న బొట్టుదారం గూడా నూలుదే. అదనంగా సన్నటి బంగారు చైనొకటి. కట్టుకున్న చీర పట్టుది. పాతగిల్లి రంగు గూడా వెలిసిపోయి ఉండడం వల్ల అనుకున్నాను బహుశా అది తన పెళ్ళినాటిదై వుండొచ్చు...

మధ్యాహ్నం పేపర్లిస్తున్నప్పుడు హెచ్చరించింది జానకీబాయి. "అమ్మాయ్ నాగమణీ! మరీ యింత నిదానమైతే ఎలాగమ్మా! ఈ పూటగూడా అలాగే 'డిలే' చేశావో, తొమ్మిదింటికి గానీ నేనింటికి వెళ్ళలేను."

"అబ్బే, ఎందుకు మేడమ్! పద్ధతెట్లాగో తెలిసిపోయిందిగదా? ఇక మీదట అందరికంటే ఓ అయిదు నిమిషాలు ముందుగా ముగించకపోతే, చూచుకోండి."

నాగమణి తానన్నమాట నిలబెట్టుకో గలిగిందనే చెప్పాలి. కానీ సాయంకాలం అయిదింటికే మేము పని ముగించినా జానకీబాయి మా దగ్గర పేపర్లు 'కలెక్ట్' చేసుకునేసరికి గంట ఆరు కావచ్చింది.

ఆ గంట సేపట్లో నాగమణితో జరిగిన బాతాఖానీ నాకు చక్కటి కాలక్షేపం.

"ఏమండీ మేష్టరుగారూ! పూటకు పాతికేననుకున్నా రోజుకు యాభైపేపర్లు ఆరు రోజులకు ఆరు యాభైలు మూడువందలు. అన్నట్లు పేపరు కెంతిస్తారండీ?"

"ఎంతో ఎక్కడమ్మా, ముప్పై అయిదుపైసలు!" అన్నాను.

"పోనీలెండి! ఎంతలేదన్నా వంద రూపాయలవుతుంది. టి.ఎ., డి.ఎ. గూడా కలుపుకుంటే వందాయాభైకి తగ్గకపోవచ్చు. 'స్పాటు' కొచ్చినందుకు గుర్తుగా ఏదైనా కొనుక్కోవాలని వుందండీ...!"

నేను నవ్వాను. "అమ్మా నాగమణీ! నాన్చడమెందుకు చెప్పు? ఆ నిర్ణయ మేదో ఈపాటికి జరిగిపోయేవుంటుంది. ఏం కొనుక్కోవాలనుకుంటున్నావో చెప్పగూడదా?"

"మేష్టరుగారూ! వాచీ లేకపోవటం నామోషీగా ఉందండీ!" గుణిసి, గుణిసి ఆ మాట చెప్పింది నాగమణి అప్పటికి తాను నాకేదో క్షమాపణ చెబుతున్నట్టుగా!

"దానికేం భాగ్యం? కొనుక్కుంటే పోలా! అంతగా నీకు తెలియకపోతే నేను కొనిస్తానులే" అన్నాను.

అప్పుడు గమనించాను. చేతికి ఆరేసి సాదా గాజులు మాత్రమే వున్నాయి నాగమణికి. ఉద్యోగినిలా కనిపించకపోవడానికి బహుశా ఆమె చేతికి వాచీ లేకపోవడం గూడా ఒక కారణం అయి వుండాలి.

ఉన్నదున్నట్టుగా చెప్పేస్తుంది నాగమణి. లేనిపోని డాబులు ప్రదర్శించి తన వ్యక్తిత్వం చుట్టూ 'ఇమేజి'ని కల్పించుకోవాలన్న తాపత్రయం ఆమెలో కనిపించదు. వీలయినంతలో అందరితోనూ కలుపుగోలుగా వుంటుంది. అలాగని ఆమె వ్యక్తిగత విషయాలను గురించి అడిగి తెలుసుకునే చొరవ నా అంతట నాకు లేకపోయింది. ఆది నుంచీ ఆ ధ్యాసలోనే వున్న తోటి టీచర్లు ఆమె ద్వారా ఒక్కొక్కటిగా వివరాలు రాబట్టగలిగారు.

నాగమణి పుట్టింది రాయలపేట. విద్యాభ్యాసం పుంగనూరు. ట్రెయినింగు కావడం కార్వేటినగరం. ఆమె నిచ్చిందేమో దేవళంపేట. తానక్కడే ఉద్యోగం చేస్తోంది. భర్త వి.డి.ఓ. అనగా విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసరు. వంద మైళ్ళ దూరంలో సత్యవేడు సమితిలో అతడి ఉద్యోగం. ఇద్దరు బిడ్డలామెకు. పెద్దవాడు హరి. ఆరేళ్ళు. రెండోది చందన. నాలుగేళ్ళు.

స్పాట్ నిర్వాహకులు మగ టీచర్లకు పట్టణంలో వేరే ఇంకొక చోట హైస్కూల్లో బస ఏర్పాటు చేశారు. ఆడ టీచర్లకు కరెక్షన్ జరుగుతున్న స్కూల్లోనే నాలుగైదు మారుమూల గదులు కేటాయించారు. నా బసను నేను వెతుక్కోవడంకోసం పట్టణంలోకి బయల్దేరుతూ "ఇక నేను వెళ్ళొస్తానమ్మా నాగమణీ! రేపు ఉదయం కలుసుకుందాం" అన్నాను.

"వెళ్ళిరండి మేష్టరుగారూ! మీరదృష్టవంతులు. మనుషుల ముఖాలు చూచుకుంటూ మీరూ బజార్లల్లో ఎంతసేపు తిరిగినా అడిగేవాళ్ళుండరు. బుద్ధిపుడితే రెండో సినిమాకు గూడా వెళ్ళగలరు. మా బ్రతుక్కలా కుదరదే! ఎక్కడికెళ్ళినా మేము ఎనిమిది గంటలకల్లా తిరిగొచ్చేయాలట! రాకపోయామో, గేటుకు తాళం! పోలీసుల కాపలాగూడా! నికరంగా మేము జైల్లో ఉన్నట్టే లెక్క!"

నిజమే. స్కూలు కాంపౌండునుంచి బయటకు వెళ్ళేసరికి జైల్లోనుంచి బాహ్య ప్రపంచంలోకి వచ్చినట్టే తోచింది. పట్టపగల్లా విద్యుద్దీపాలు వెలుగుతున్న బజార్లలో నడుస్తుంటే వింతలు, వినోదాలూ చూస్తూ పెద్ద తిరణాలలో తిరుగుతున్నట్టే వుంది. ఉపాధ్యాయుణ్ణి గాకుండా ఒక పంతులమ్మనై వుంటే నాకీపాటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభ్యమయి వుండేవి కావనిపించేసరికి మనసు కతుక్కుమంది...

అయితే, చెరపడిన రాకుమారిని విడిపించడానికి ఓ రాకుమారుడు వుండేవుంటాడన్న విషయం ఆ మరునాటి ఉదయంగానీ నా కవగతమైంది గాదు. స్కూలుగేటుకింకా పదిబారల దూరంలో వుండగా ఎదురుగుండా ఓ ఆఫీసు ఆవరణలో ఒక యువకుడితో మాట్లాడుతూ కనిపించింది నాగమణి. నేను దృగ్గోచరుణ్ణి కాగానే "ఉండండి, మేష్టరుగారికి పరిచయం చేస్తాను" అంటూ నన్ను పిలిపించింది.

"స్పాటుకు వెళ్తున్నట్టు ఉత్తరం రాశానేమో, ఈయన రాత్రికి రాత్రే వచ్చి వాలిపోయారు. పది గంటలప్పుడు పోలీసులతో పెద్ద లడాయి జరిగిందట! నాకు తెలియదు. ఉదయం పోలీసులొచ్చి మీ తాలూకు మనిషి యెవరో వచ్చి మా దుంపతెంపేశాడని నా దగ్గర ఫిర్యాదు చేశారు. వచ్చి చూచుకుందునుగదా, ఆయనే ఈయన!"

"మంచిదండీ! సమయానికొచ్చేశారు. ఉంటారు గదా!" అన్నాను.

అతడు నవ్వాడు. ఇంక నేనెక్కడికి వెళ్తాను అన్న భావం ఆ నవ్వులో ధ్వనించింది.

నాగమణి భర్త ప్రాపంచిక నియమాలను పెద్దగా సరకుచేసే వాడిలాలేదు. గడ్డం పెరిగింది. క్రాపింగు చిందర వందరగా వుంది. దుస్తులు మాసిపోయాయి. చెప్పులపైన, పాంటు అంచులపైన బురద డాగులు కూడా కన్పిస్తున్నాయి. ఎంతగా గాలించినా అతడిలో

ఉద్యోగి లక్షణాలు కానరావటం లేదు. హఠాత్తుగా చూచినప్పుడు అతడెవరో కాందిశీకుడని మాత్రమే అనుకోవలసివస్తుంది.

ఏమయితేనేమి, భర్త రాకవల్ల నాగమణి స్టేటస్ ఇట్టే మారిపోయింది. మధ్యాహ్నం పన్నెండున్నరకల్లా గేటు దగ్గర మీల్స్ కారియర్ రెడీ! హోటల్ నుంచి తానే తీసుకొచ్చాడు. ఉదయం పదిగంటలప్పుడొకసారి, సాయంకాలం నాలుగు గంటలకొకసారి టీ తీసుకెళ్ళి 'నాగమణి' అనే ఆవిడకియ్యవలసిందిగా కాంటీను కుర్రవాడికి పురమాయించాడు. మధ్యాహ్నం నాగమణి గేటు దగ్గరికి వెళ్ళినప్పుడు "నీ బట్టలూ అవీ తీసుకుని సాయంకాలం చక్కా బయటి కొచ్చేసెయ్. హోటల్లో రూం బుక్ చేశాను" అన్నాడట గూడా!

కంటికి రెప్పలా చూచుకునే భర్త దొరకడం కన్న ఆడవాళ్ళు కోరుకోదగ్గ అదృష్టమేముంటుంది?

ఆ మాట కాస్తా బాహాటంగానే అనేశానేమో నాగమణి ముఖం వెలవెల పోయింది.

"అబ్బే, అలా అనుకోకండి మేష్టారుగారూ! ఈయన వూరికి వచ్చిగానీ, నా ముఖం చూచిగానీ నాలుగు నెలలయింది. ఎందుకులెండి? అదంతా ఒక పెద్ద కథ!"

కథ మనది కానప్పుడు దాన్ని ఎంత ఉల్లాసంగానైనా చెప్పుకోవచ్చు. ఆర్తిని గురించి చెప్పవలసి వచ్చినప్పుడుగూడా హాస్యరసాన్ని పుట్టించవచ్చు. కానీ వ్యథలతో కూడిన ఆత్మకథను చెప్పుకోడం మాత్రం యెవరికైనా బాధాకరమైన అనుభవమే! అయితే వ్యథలకు బాగా అలవాటు పడిపోయినందువల్ల కావచ్చు, నాగమణి తానిందాక ఉదాహరించిన 'పెద్ద కథ'ను సాధ్యమైనంత నిర్లిప్తంగానే చెప్పగలిగింది.

"ఊరికొచ్చి నాలుగు నెలలయిందన్నానా, ఈయన ఇంటికొకపైసా పంపించి రెండేళ్ళయింది. అత్తమామలతో కలిసి ఇంట్లో మేమయిదుగురం వున్నాం గదా, మాకు నా జీతం రాళ్ళే ఆధారం. మూడేళ్ళనాడు ఏడువేలప్పు చేసి ఆడపడుచుకు పెళ్ళిచేశాము. ఆ అప్పుకూడా నేనే కొంచెం కొంచెంగా తీర్చేసుకుంటున్నాను. మొదట మొదట ఈయన నెలనెలా నూరో, ఇన్నూరో పంపిస్తుండేవారు. రాను రానూ ఆ రివాజు కూడా పోయింది. అప్పుడాయన ఉద్యోగం సత్యవేడు సమితిలో గదండీ, ఆరు నెలలక్రితం కుప్పం సమితిలో ఉండేవారు. ఇంకొక ఆరు నెలలు గడిచేసరికి ఎక్కడుంటారో చెప్పలేము. సరిగ్గా ఉద్యోగం చేయకపోతే పైవాళ్ళు బదిలీచేస్తారు. ఈయనకు బదిలీ అంటే నీళ్ళు తాగినట్టు! ఇంతవరకు ఈయన జిల్లాలో పనిచేయని సమితులు తక్కువ. కొత్తగా ఒకచోటికి వెళ్ళారనుకోండి. ఊళ్ళూ, ఫైళ్ళూ, ఆఫీసులూ ఆ గొడవేమీ ఈయనకు కాబట్టదు. ఎక్కడ పేకాట జోరుగా సాగుతుందో ఆరాతీయడమే పని. ఒక్కపేకాటేకాదు, కాటన్ మార్కెట్లూ, సంతలో లంగర్లు, గుర్రప్పందాలు ఇలా లోకంలో ఎక్కడెక్కడైతే జూదాలు జరుగుతుంటాయో అక్కడల్లా ఈయన వుంటారు. మామగారు మాత్రం ఎంత కాలమని ఊరుకుంటారు? నాలుగు నెలల క్రితం చివరిసారిగా వచ్చినప్పుడు కొడుకుపైన బాగా నోరుచేసుకున్నారు. అప్పుడనగా అలిగి వెళ్ళిపోయిన మనిషి ఈయన ఇప్పుడే నాకు కనిపిస్తున్నారు. అన్నట్టిప్పుడే మంటున్నారో ఎరుగుదురా మేష్టరుగారూ? నేనట, ట్రాన్స్ఫరు చేయించుకుని తనతోబాటుగా వచ్చెయ్యాలట! ఇంకేమైనా ఉందా భగవంతుడా! మట్టి గుర్రాన్ని నమ్మి గోదావరిలో దిగినట్టే!"

ఆ క్షణాన నాగమణిని ఓదార్చడానికి తగిన మాటలేవీ నాకు స్ఫురించలేదు. ఆలోచించినకొద్దీ కొన్ని కొన్ని బాధలు ఓదార్పుకు అతీతంగా ఉంటాయనీ, వాటి

విషయంలో మాటలు ఖర్చుచేయటం వల్ల ప్రయోజనం ఉండదనీ అనిపించింది. నాకు విస్మయం కలిగించిన విషయం ఒక్కటే. గరళాన్ని మ్రింగవలసి వచ్చినా పైకి మాత్రం ప్రశాంతంగానే ఉండగలుగుతూంది నాగమణి. తాను యాతనకు గురవుతున్నా యితరులకు మాత్రం ఆనందాలను పంచిపెడుతోంది. తన చుట్టూరా నెలకొన్న సమాజంలో ఎంతటి అవ్యవస్థ నెలకొన్నప్పటికీ తాను మాత్రం తన 'డ్యూటీ'ని సక్రమంగా నిర్వహించకడానికే ప్రయత్నిస్తూ వుంది.

జీవిత పథంలో అడుగడుగునా అనుకోని మలుపులు పొంచివుంటాయంటే నేను నమ్మేవాడ్ని కాదు. అయితే, నాగమణి విషయంలో నమ్మవలసి వచ్చింది. స్పాటు జరిగిన ఆరు రోజుల్లో మూడోనాటి ఉదయం నాగమణికి ఆశావహంగా, ఆనందప్రదంగా తెల్లవారింది. పొడుగ్గా వాల్జడ వేసుకొని, తలనిండుకూ పూలు పెట్టుకొని, ఇంద్రనీలాల్లాంటి కళ్ళల్లో నుంచి కాంతులు చిప్పిల్లుతుండగా కలకలలాడుతున్న ముఖంతో హాల్లోకి వచ్చేసరికి అందరూ మంత్రముగ్ధులైనట్టుగా ఆమెవైపే చూచారు.

ఆమెకంత ఆనందం కలగటానికి కారణమేమిటో ఆరో బ్యాచి టీము కందరికీ ఎరుకే.

అందరిలోనూ ఆత్మీయుడ్ని గనుక ఆనందహేతువును గురించి మరింత విశదంగా తెలుసుకునే అవకాశం నాకు మాత్రమే దక్కింది.

"మనిషి కెక్కడలేని బింకంలెండి మేష్టరుగారూ! నోరు విడిచి చెప్పడం లేదుగానీ, పాడు అలవాట్లన్నీ మానుకున్నట్టే వున్నారు. జేబునిండుకూ డబ్బే! హోటల్ అప్సరస ఎరుగుదురా? అందులో మూడో అంతస్థులో రూము. యాభై రూపాయల అడ్వాన్సు యిచ్చి బుక్ చేశారు. పెద్దరూము లెండి! నేలకదేంగచ్చో - ముఖం కన్పిస్తుందంటే నమ్మండి! ఒక కుర్చీలా, ఒక సోఫాలా, ఒక నిలువుటద్దమా - అంతా మనం సినిమాల్లో చూస్తామే అలాగుంది. బటన్ నొక్కితే చాలు, ఓ కుర్రాడు ఏం కావాలంటూ పరుగెత్తు కొచ్చేస్తాడు. కాఫీ, టిఫిన్, భోజనం అన్నీ సరాసరి పైకొచ్చేయటమే! రాత్రి రెండోఆట సినిమాకు కూడా వెళ్ళొచ్చాము. సినిమా మాటకేం గానీండి, దానిలో ఓ డ్రీమ్ సీనుంది. చెప్పతరం కాదనుకోండి! దానికి వేసిన సెట్టొకటే లక్ష రూపాయలైందట, మా ఆయనే చెప్పారు. ఆయన కిలాంటి విషయాలు కొట్టిన పిండే."

"బాగుందమ్మా నాగమణీ! ఇలాంటి తతంగం నీకు పెళ్ళయిన కొత్తలో జరిగివుంటే మరీ బాగుండేది. జరుగుబాటున్నవాళ్ళ నూతన దాంపత్య జీవితాల్లో ఇలాంటి మజిలీలను 'హనీమూన్' అంటారట! నేనున్నూ వినడమే!" అన్నాను.

'స్పాట్'లో మిగిలిన నాలుగురోజులూ నాగమణి పాలిటికి నాలుగు క్షణాల్లా గడిచాయి. మాకు మాత్రం మామూలే! నాలుగు గడ్డు రోజులుగానే గడిచాయి. ఇన్‌స్ట్రక్షన్ బాగున్న స్కూళ్ళల్లో విద్యార్థులు ఓ రకంగా మార్కులు తెచ్చుకుంటున్నారు. చదువు చెప్పకపోయినా కాపీ కొట్టటానికి వీలు కల్పించిన స్కూళ్ళలోని విద్యార్థులు నిరాఘాటంగా పాసైపోతున్నారు. చదువూ చెప్పక, కాపీ కొట్టే సదుపాయమూ కల్పించని స్కూళ్ళలోని విద్యార్థులు రెక్కలు తెగిన ఈసిళ్ళకు మల్లే రాలిపోతున్నారు. ఎలాగైనా మార్కులు వేయించి బిడ్డను పై తరగతిని రవాణా చేయించే మహదాశయంతో విద్యార్థుల తండ్రులు బయట స్కూలు కాంపౌండు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. లోపల కాంప్ ఆఫీసర్ పరశురామయ్యగారు ఉదయం, సాయంకాలం ఉభయ వేళలా మైకులో హెచ్చరికలు

కురిపిస్తున్నారు. జవాబు చదివి మార్కులిచ్చే ఉపాధ్యాయులు యిస్తున్నారు. ఆ ఓపిక లేక రమారమిగా చేతికొచ్చినన్ని, మనసుకు తోచినన్ని మార్కులు పడేసే టీచర్లు - అలాగే ముందుకు దూసుకుపోతున్నారు.

ఆరోనాటి రాత్రి మాకు రావలసిన ప్రతిఫలం మాకు ముట్టేసరికి గంట తొమ్మిది గావచ్చింది.

మరునాటి ఉదయం బజార్లో అంగళ్ళు తెరిచిన తర్వాత యింటికి కావలసిన వస్తువులేవో కొనుక్కున్నాను. ఏకంగా పదకొండు గంటలకు భోజనం చేశాను. పన్నెండు గంటలప్పుడు బస్‌స్టాండు చేరుకున్నాను.

మతాలు వేరయినా భగవంతుడొక్కడే అయినట్లుగా వెళ్ళే ఊర్లు వేరయినా ఆర్టీసీ బస్సులన్నీ ఒక్కలాగే ఉన్నాయి. ఎటొచ్చీ దేవునికొక పేరంటూ లేకపోవటం మానవజాతికి శ్రేయస్కరమే! కానీ బస్సెక్కడికి వెళుతుందో తెలియజేసే - నేమ్‌బోర్డు లేకపోతే ప్రయాణీకుల గతేం కావాలి? ఎగాదిగా చూస్తూ బస్‌స్టాండును సర్వే చేస్తున్నానేమో, పరిచితమైన కంఠం వినిపించింది.

"వెళ్ళొస్తానండి మేష్టారుగారూ! నమస్కారం! ఇదే మా ఊరి బస్సు..."

చిన్నబోయి వున్న నాగమణి ముఖం చూచేసరికి కడుపులో చేయి పెట్టి దేవినట్టయింది.

'ఏమైందమ్మా? ఎందుకలా వున్నావు' అని అడగవలసిన సందర్భం. ఎందుకోగానీ, అలా అడగటానికి మనస్కరించక, బస్సెక్కి ఆమెకెదురుగా ఖాళీగా వున్న సీట్లో కూచున్నాను.

ముఖం అవతలికి తిప్పుకుంటూ కన్నీళ్ళను చీర చెరగుతో తుడుచుకుంది నాగమణి.

"లాభం లేదండీ మేష్టరుగారూ! ఆ మనిషిలో చిన్న మెత్తుకూడా మార్పు లేదు. తానుద్యోగం చేస్తున్న ప్రాంతాల్లో నుంచి ఓ పెద్దమనిషి వచ్చి మాట్లాడుతుంటే రాత్రికి రాత్రే నాకు తెలిసింది. మార్కులు వేయిస్తానని చెప్పి ఈయన పదిమంది ఆసాముల దగ్గరునుంచీ పదివందల రూపాయిలు తెచ్చేసుకున్నారట! నిన్నటిదాకా దర్జాగా ఖర్చు పెడుతూ వచ్చిందంతా ఆ డబ్బే! పై పటారానికేం లెండి ఉన్నవల్లా రెండు జతల దుస్తులు. ఒక జత వేసుకుంటే యింకో జత ఉతుక్కోడం! ఓ పాంటూ షర్టూ కొనిపెట్టి ఇంతకు మునుపే బస్సెక్కించాను..."

వ్యానిటీ బాగుకు బదులుగా నాగమణి తెచ్చుకున్న చేతిసంచి ఆమె ఒడిలో కనిపించింది. ఇప్పుడందులో ఒక బస్సు, ఒక బూరా వున్నాయి. రెండూ ప్లాస్టిక్కువే! పిల్లలు సంతోషించడానికి ఆపాటి వస్తువులే చాలు. నాగమణి గూడా ఓ నాలుగేళ్ళ అమ్మాయి అయిపోతే బాగుండును. ఎంచక్కా ఓ ప్లాస్టిక్కు వాచీ కొనుక్కోగలిగి వుండేది గదా!

♦ యువ దీపావళి సంచిక - 1976 ♦